
# సాబాను టెలుగు ఉగాడి

- డా॥ బి.దామోదరరావు




'గుడ్‌మార్నింగ్ డాడీ'

'గుడ్‌మార్నింగ్ మమ్మీ' అంటూ నిద్రలేచారు- 'బంటీ' అనబడే భానుచందర్, 'చిన్నూ' అనబడే చంద్రరేఖ.

'వెరీగుడ్ మార్నింగ్'- తండ్రి విశ్వనాథం.

'ఏమే' అన్నాడు; చేతిలో ఇంగ్లీషు పేపరు...

'హేయ్, ఏమోయ్ టీ అయిందా?

పిల్లలూ! మీ మమ్మీ కిచెన్‌లో ఉంది, మీరు బాత్‌రూంకెళ్లి ఫేస్ శుభ్రం చేసుకోండి. టూత్‌పేస్ట్, బ్రష్ ఆ సింక్ వద్ద వున్నాయి'

'ఎస్, డాడీ' అన్నారిద్దరు చిన్నారులూ.

వాళ్ల ఆంగ్ల ఉచ్చారణ ముద్దొస్తోంది విశ్వనాథ్‌కు. తానెన్ని కలలు కన్నాడు- వాళ్లు అట్లా మాట్లాడాలనీ, ప్రత్యేకించి- ఇంటి వద్ద ట్యూషన్ చిన్ననాడే మూడేళ్లకే, పిల్లల్ని ఖరీదైన కాన్వెంటుకు పంపించింది అందుకే. తెలుగు పేపరని తండ్రి మొత్తుకున్నా, టి.వి.లో 'న్యూస్' చూడమని ఇంగ్లీషు మాటలతో చెప్పి, ఇంగ్లీషు పేపరే వేయించాడు.

'డాడీ! నా బుక్స్'- బంటీ.

'డాడీ! నా బూట్లు'- చిన్ను.

'వేట్, వేట్... అయామ్ బిజీ. అం అం టీపాయ్ పక్కనే వున్నాయి'

'ఏమోయ్ కాంతం! కర్రీస్ ఏం చేశావ్! చట్నీ ఏమిటీ?'

'బెండకాయ ఫ్రై చేశావా! మటన్ ఉడకేశావా! ఫిష్ ఫ్రిజ్‌లో ఉందా? పిల్లలకు మంచి ప్రోటీన్ ఫుడ్ పెట్టమన్నాడు డాక్టరు. బ్రెడ్, జామ్ టిఫిన్ బాక్స్‌లో పెట్టావా? వాటర్ బ్యాగ్ ఉందా? బాటిల్‌లో ఫిల్టర్ వాటర్ పోశావా? హర్రీ... హర్రీ... స్కూల్ ఆటో వస్తుంది మరి!'

'అన్నట్టు, నా లంచ్ ఇవాళ ఆఫీసులోనే. పార్టీ అరేంజ్ చేశారు స్టాఫ్'

'అం అం ఆ షూస్‌తో కిచెన్‌లోకి రాకండి. నేనిప్పుడే క్లీన్ చేశాను. దేవుడి ఫొటోకి దండం పెట్టాను. మీరు కాస్త ఇంగ్లీషు తగ్గించండి డార్లింగ్! అన్నట్టూ... ఇవాళ మన మ్యారేజ్ డే. మరిచిపోయారా! హోటల్ తాజ్‌లో డిన్నరు ఏర్పాటు చేయండి అంది గోముగా కాంతం.

'ఓం ఎస్... అలాగే! స్పెషల్ అయిటమ్స్ కూడా ఉంటాయి కదూ'- అన్నాడు చిలిపిగా.

'హూం ఉంటాయి. పిల్లలు సినిమా ఫస్ట్ షోకు వద్దు, సెకండ్ షో అంటున్నారు. వెళ్తూ వెళ్తూ ఆ స్కైలైన్‌లో టిక్కెట్స్ తీసిపెట్టుకోండి. రిజర్వ్ క్లాసు మరువొద్దు. (ఛా...ఛా... వద్దనుకున్నా తన్నుకు వస్తున్నాయి ఇంగ్లీషు మాటలు అనుకుంది మనసులో).

'సరె, సరె... పిల్లలూ! బాక్స్‌లో రైస్, చపాతీ పెట్టుకున్నారా! డ్రైవర్ పిలుస్తున్నాడు వెళ్లండి'

'హలో! నేను వెళ్తున్నానోయ్'- బైక్‌లో పెట్రోల్ ఉందో, లేదో అనుకుంటూ ముందుకు కదిలాడు విశ్వనాథం.

సాయంత్రం-

'గుడ్ ఈవినింగ్, పప్పా!' (పప్పులు కావు) పిల్లలు తండ్రి దగ్గరికి వచ్చి కూర్చున్నారు.

'అవునూ! మీ స్టడీస్ ఎట్లా వున్నాయి. ఎగ్జామ్స్ డేట్స్ వచ్చాయా? హాలిడేస్ ఎప్పుడూ?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు విశ్వనాథం.

బంటీ చెప్పాడు– 'మా సోషల్ టీచర్ మరీ ఫాస్ట్ నాన్నా! ఎప్పుడూ ఎగ్జామ్స్ అంటూ చంపుతుంది. హోమ్‌వర్క్ బాగా చెప్తుంది'

'మా సైన్స్ టీచర్ అంతే నాన్నా! ఆవిడకు నేనంటే యాంగ్రీ! సరిగా వర్క్ చేయనట. పాస్ మార్కులేస్తుంది'

కాంతం వచ్చి కూర్చుంది.

'ఏం పిల్లలో ఏమో! సగం తెలుగు, సగం ఇంగ్లీషు. ఇంట్లోనైనా కాస్త అమ్మా, నాన్నా అన్న మంచి మమత వున్న పేర్లతో పిలవటం లేదు. వెధవది– పల్లెటూర్లో చదివినదాన్ని, నాకీ మధ్య ఇంగ్లీషు పదాలు తప్పటం లేదు. అవునూ! ఈ తప్పంతా మన పాలకులదే కదా! తెలుగు చదివితే ఉద్యోగాలు అంటేనో, తెలుగు మాస్టార్లు తప్పనిసరిగా ప్రతి స్కూల్లో ఉండాలంటేనో, కొంత తెలుగుకు విలువ పెరిగి, కాస్త బతికి ఉండే మార్గం ఉంటుందేమో. కాకపోతే, వచ్చే తరాల్లో తెలుగు మాయం అవడం ఖాయం' అంటూ చిన్న సైజ్ ఉపన్యాసమే ఇచ్చింది.

'చాల్లేవోయ్! గ్లోబ్ అంటే ప్రపంచం. అంతా ఒక హోమ్, ఇల్లు అవుతుంటే నీదో చాదస్తం మరీనూ' అన్నాడు కాస్త మందలింపుగా విశ్వనాథం.

'అయితే అవ్వనివ్వండి; ఇంట్లో ఆప్యాయతలు, సంబరాలు, సంస్కృతి, అన్నీ మరవాలనే చెప్పారా, ఎవరైనా! పిల్లలకు మరీ మనమన్నా చెప్పటం తెలీదు. మీరు ఎన్నైనా చెప్పండి. ఈ స్వభాను ఉగాది నుండి నేను తెలుగులోనే మాట్లాడతాను. అంతేకాదు– నా పిల్లలు ఇంగ్లీషుతోపాటు ప్రపంచ భాషలన్నీ నేర్వనీ, నన్ను మాత్రం 'అమ్మా' అనీ, మిమ్మల్ని 'నాన్నా' అని పిలవమనే అంటాను. లేకుండా నేనసలు మరెవ్వరితో మాట్లాడను– అని తెగేసి చెప్పింది కాంతం.

'ఏమిటోయ్... మరీ అంత సీరియస్' అంటూ అనునయించబోయాడు విశ్వనాథం.

'అదిగో! మళ్ళీ ఇంగ్లీషు ముక్క. తెలుగువాళ్లం, ఇదేమి ఖర్మ. ప్రొద్దున లేచింది మొదలు, రాత్రి పరుండే వరకు తెలుగులో ఎన్ని ఇంగ్లీషు మాటలు. అసలు అవి లేకుండా మాట్లాడే పరిస్థితి పోతోంది. వీల్లేదు. ఏయ్ పిల్లలూ! (పిల్లలు వాళ్ల వాదన వింటున్నారు. వాళ్లకు విషయం అర్థమౌతోంది) మీరు ఈ పండుగ నుండి ఇంట్లో తప్పక తెలుగులోనే మాట్లాడాలి కదూ. ఇదుగో, తాతయ్య పిలుస్తున్నాడు వెళ్లండి. 'గ్రాండ్‌పా' అంటూ కాక 'తాతయ్యా' అని పిలవండి. తెలుగు మేస్టారుగా పదవీ విరమణ చేశారుగా. మీకు తప్పక తెలుగు కవితలు, పద్యాలు చెప్తారు. అవి కూడా నేర్చుకోండి మరి!' అంటూ బతిమిలాడినట్లుగా అంది.

'మమ్మీ' అనబోయిన పిల్లలు– 'అలాగే అమ్మా' అన్నారు. కాంతం మనస్సు ప్రేమతో నిండిపోయింది.

పిల్లలు తాతయ్య గదిలోకి వెళ్లారు. చూడండి పిల్లలూ! తెలుగు చరిత్ర, వైభోగం ఎంతో గొప్పవి. అంతెందుకు ప్రతి జాతి తన ప్రాముఖ్యతను గుర్తుంచుకోవాలంటే, తమ భాషను బతికించుకోవాలి. తమ భాషను గౌరవించటం అంటే– తమ తల్లిని గౌరవించటం అన్నమాట. ఇదిగో, ఈ రోజు నుండి రోజూ ఒక వేమన పద్యం వినిపిస్తా. నేర్చుకోండి మరి! ✦

## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం–

| | |
|---|---|
| *పత్రిక విడిప్రతి* | *: 5/-* |
| *ప్రత్యేక సంచిక (ఉగాది,దీపావళి)* | *: 10/-* |
| *సాలుసరి చందా* | *: 60/-* |

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**
79బి, జర్నలిస్టు కాలనీ,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

# భాస్వరంలో బాల్యం?

ముడితే ముడుచుకునే ఆరుద్ర పురుగులాంటి మెత్తని మఖ్‌మల్ దేహాలే
మృదువైన నెమలి ఫించం లాంటి అరచేతులే
కపటమెరుగని తమ పసితనాన్ని నేర్పుగా గంధకంతో పొట్లాలు పొట్లాలుగా
మడిచి మడిచి బాల్యానంద గంధాన్ని కోల్పోతున్నాయి
రేపు ఆనందంతో కాకరొత్తులు కాలుస్తూ చేతులు కాల్చుకుంటారో లేదో
చర్మాలు మాత్రం రసాయనాలతో ఇప్పుడే కరడుగట్టి
పిడకలైపోతున్నాయి
బాంబులను చుడ్తూ చుడ్తూ బాల్యం చుట్ట చుట్టుకుపోతోంది
చేతుల్లోని. అదృష్టరేఖలు మలిగి మలిగి మాడిపోతున్నాయి
బాల భాస్కరులు బతుకు కాలి బాల కార్మికులౌతున్నారు
చిచ్చర పిడుగులు చిచ్చుబుడ్డులై గప్పున ఆరిపోతున్నారు
గోళ్ళ సందుల్లోంచి భాస్వరం బుక్కెడన్నంతో గొంతుజారి
కడుపులో మండి ఆకలిని ఇంకా మండిస్తోంది
భాస్వరంలో బాల్యం అమందానంద స్వరాల వరాలు కోల్పోయి
దిష్టి బొమ్మైపోతోంది
చదువుతనం ఎరుగని బాల్యం కూలితనంతో కూలిపోతోంది
పలకా బలపం ఎంతెంత దూరం–కోసుకోసు దూరం
తారజువ్వల్లో కాకరొత్తుల్లో బాంబుల్లో
నవ్వుల పువ్వులు–అచ్చట్లు ముచ్చట్లు–దొరకని చందమామ కథలు
అర్ధాకలి పండగలు అన్నీ పొట్లాలై చేతులు మారిమారి
ధరలు పలికి పలికి వ్యాపారులకు మేడలు కట్టి
పండుగనాడు పేలిపోతూ కాలికాలి బూడిదౌతున్నాయి
భాస్వరంలా భగ్గుమనించి వెలకట్టి బలిచేసిన బాల్యాన్నీ
పసివారి పెదాల నుండి జారిపడ్డ నూరు నూరు నవ్వులనూ
ఎవరివ్వగలరు
మేధావుల విరచిత చిత్రవిచిత్ర సవరణలతో బరువైన రాజ్యాంగం
స్వేచ్ఛాపహరణమైన బాల్యాన్ని చూస్తూ చూస్తూ పార్లమెంటు
వెలిగిపోయేలా పండగ చేసుకుంటోంది కదా–
శివకాశీ నిండా భస్మమైన బాల్యం కుప్పల సాక్షిగా!!
భాస్వరంతో మండే బాల్య భారతాన్ని చూడలేక
భూమాత భూచక్రంలా వేడెక్కి వేదనగా తిరుగుతోంది!!??

**–కందాళై రాఘవాచార్య**